# సహజ మరియు సేంద్రీయ వ్యవసాయ : వివిధ రకాల కషాయాలు

పూర్వం నుండి వ్యవసాయం మనిషి యొక్క జీవన ఆధారం సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పంటలను సాగు చేసేవారు. కానీ ఆధునిక కాలములో రైతులు అధిక ఉత్పత్తే లక్ష్యంగా తాము పండించే పంటలకు అధిక మోతాదులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, వివిధ రకాల సంకర జాతి మరియు జన్యు మార్పిడి చేసిన పంటలు వాడుతున్నారు. పంట ఉత్పత్తికి రసాయనాలను విస్తృతంగా ఉపయోగించడం వలన భూమిని కలుషితం చేయటం కాకుండా భూసారాన్ని తగ్గిస్తుంది. అధిక మందులు మరియు రసాయనాల ఉపయోగం వలన పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తు క్రిమిసంహారక, జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి మరియు వినియోగ దారుల ఆరోగ్యంపైన తీవ్రమైన ప్రభావం కలిగిస్తాయి.

దీనికి ప్రత్యామ్నాయంగా సేంద్రీయ వ్యవసాయంతో ఈ సమస్యలకు పరిష్కారాలను అందించడానికి సహాయపడుతుంది. సేంద్రియ వ్యవసాయం వలన పర్యావరణ సమస్యలు, జీవవైవిధ్య నష్టాలను తగ్గించి ఆహార భద్రత, పశువుల సంక్షేమానికి ఎలాంటి హానికలగ కుండా చేస్తుంది. సేంద్రియ విదానాలను ప్రోత్సహించుట ద్వారా రైతు మిత్రులుగా భావించే సస్యజీవులను తిరిగి పునరుజ్జీవింప చేయవచ్చును, నేలలో ఉత్పదక శక్తిని పెంపొందిస్తుంది.

దీనిసే మనం సహజ మరియు సేంద్రియ వ్యవసాయం (ZBNF) అని అంటాము. ప్రకృతిలో స్థానికంగా అందుబాటులో ఉన్న సహజ వనరులను అనగా పశువులపేడ, మూత్రం, చెట్ల ఆకుల ద్వారా తయారు చేసుకునే కొన్ని రకాల కషాయాలు ఉపయోగించి పంటలు పండించడం వలన కృత్రిమ / రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.

## బీజామృతం



### కావలసిన పదార్థాలు :

1. నీరు 20 లీటర్లు
2. నాటు ఆవు మూత్రం 5 లీటర్లు
3. నాటు ఆవు పేడ 5 కిలోలు (7 రోజులలోపు సేకరించినది)
4. పొడి సున్నం -50 గ్రాములు. పుట్ట మట్టి/పొలం గట్టు మన్ను దోసెడు.

### తయారుచేసే విధానం

- ఆవు పేడను ఒక పల్చటి గుడ్డలో మూటగా కట్టి 20 లీటర్ల నీరు ఉన్న తొట్టెలో 12 గంటలు నానబెట్టాలి
- ఒక లీటరు నీటిని వేరే పాత్రలో తీసుకొని అందులో 50 గ్రాముల సున్నం కలిపి ఒక రాత్రంతా ఉంచాలి. రెండవ రోజు ఉదయాన్నే నానబెట్టిన పేడ మూటను చేతితో పిసికి ద్రవ సారాన్ని నీటి తొట్టెలో కలపాలి. పేడ నీళ్ళున్న తొట్టెలో పొలం గట్టు మట్టిని పోసి కర్రతో కుడిపైపునకు కలియ తిప్పాలి. 5 లీటర్ల దేశీ ఆవు మూత్రాన్ని, సున్నపు నీటిని పేడ నీరున్న తొట్టిలో పోసి కలిసిపోయే వరకూ కుడివైపునకు కలియ తిప్పాలి. అన్నీ కలిపిన ఒక రాత్రి అలాగే ఉంచి మరునాడు ఉదయం నుంచి 48 గంటలలోపు వాడుకోవాలి.

### ఉపయోగించే విధానం

- ఇలా తయారు చేసిన బీజామృతం విత్తనం విత్తే ఒకరోజు ముందు విత్తనాల పై చల్లి గుడ్డతో మూట కట్టి బాగా కలపాలి.
- ఇలా చేసిన విత్తనాల్ని నీడలో ఆరబెట్టి మరుసటి రోజు విత్తుకోవాలి.

## ఘన జీవామృతం

### తయారీకి కావాల్సిన పదార్థాలు

1. దేశీ ఆవు పేడ (వారం రోజుల్లో సేకరించినది)- 100 కిలోలు తెసుకోవాలి
2. దేశీ ఆవు మూత్రం-5 లీటర్లు
3. పిడికెడు పుట్టమట్టి లేదా రసాయనాలు తగలని పొలం గట్టుమన్ను.
4. ద్విదళ పప్పుల - పిండి 2 కేజీలు (శనగ, ఉలవ, పెసర, మినుముల పిండి ఏదైనా ఒకటి అయితే, నూనె శాతం ఎక్కువగా ఉండే వేరుశనగ, సోయాచిక్కుళ్ల పిండి వాడరాదు)
5. బెల్లం -2 కేజీలు (నల్లబెల్లం అయితే మరీ మంచిది) లేదా చెరకు రసం 3 లీటర్లు.





**తయారుచేసే విధానం:** చెట్టునీడలో లేదా పెడ్డులో పై తెలిపిన పదార్థాల అన్నిటినీ వేసి చేతితో బాగాకలిపి, 10 రోజులు ఆరబెడితే ఘన జీవామృతం సిద్ధమవుతుంది, తయారు చేసిన వారం రోజుల్లో పొలంలో వెదజల్లి, దుక్కి దున్నవచ్చు. నిల్వచేసుకొని తదనంతరం వాడుకోవాలను కుంటే దినుసులన్నీ కలిపిన వెంటనే గుండ్రటి ఉండలుగా చేసి నీడలో ఆరబెట్టుకోవాలి. ఆ ఉండలను గోనె సంచులలో నిల్వ ఉంచుకోవాలి. సీజన్లో అవసరమైనప్పుడు ఉండలను పొడిగా చేసుకొని పొలంలో వెదజల్లుకోవాలి.

**ఉపయోగించేవిధానం:** పై విధముగా ఆరబెట్టిన 100 కిలోలు ఘనజీవామృతాన్ని బాగా చవికిన 100 కిలోలు పశువులఎరువుతో కలిపి ఒక ఎకరం పొలంలో వెదజల్లాలి. దీని వాడకం వల్ల భూమిలోని సూక్ష్మ జీవరాశులు, వానపాములు ఆరోగ్యంగా వ్యాప్తి చెంది భూమి సారవంతం అవుతుంది.

## ద్రవ జీవామృతం

**కావలసిన పదార్థాలు:** (ఒక ఎకరానికి)

1. నీరు -200 లీటర్లు
2. పశువుల పేడ (ఆవు, ఎద్దు, గేదెల) -10 కిలోల
3. పశువుల మూత్రం - 5 నుంచి10 లీటర్లు
4. బెల్లం (నల్ల బెల్లం శ్రేష్ఠమైనది)- 1 నుంచి 4 కిలోల
5. పప్పు ధాన్యాలపిండి (ఉదా: ఉలవ, అలసంద, కంది, మినప, పెసరపిండి ఏదైనా ఒకటి)- 1 కిలో
6. పొలం గట్టుమట్టి పిడికెడు.



**తయారీ విధానం:** ఎండ తగలని చోట సిమెంటు తొట్టి లేదా ప్లాస్టిక్ డ్రమ్ములో 200 లీటర్ల నీటిని నింపాలి. 10 కిలోల పేడ, మూత్రం, బెల్లం, పిండి తదితరాలను అందులో వేసి బాగా కలపాలి. గడియారం ముల్లు తిరిగే దిశగా కర్రతో కలియతిప్పాలి. గోనెసంచి కప్పి ఉదయం ఒక నిమిషం, సాయంత్రం ఒక నిమిషం కలియతిప్పుతూ ఉండాలి. 48 గంటల తర్వాత వాడకానికి జీవామృతం సిద్ధమవుతుంది. (వారం రోజులలోపు ఉపయోగించాలి).

**ఉపయోగించే విధానం:** ఎకరానికి 200 లీటర్ల జీవామృతాన్ని ప్రతి15 రోజుల ఒకసారి పారెనీటి తోపాటు వాడాలి లేదా భూమిలో పదునుంటే నేరుగా చల్లాలి. జీవామృతాన్ని అన్ని పంటల పైన పిచికారీ చేయొచ్చు.

## పంచగవ్య

**కావలసిన పదార్థాలు:**

1. ఆవు పేడ - 5 కిలోలు
2. ఆవు నెయ్యి - 1/2 కేజీ
3. ఆవు పాలు - 2 లీటర్లు
4. ఆవు పెరుగు -2 కిలోలు
5. ఆవు మూత్రం- 3 లీటర్లు
6. తాటి/ఈత కల్లు - 3 లీటర్లు
7. లేత కొబ్బరి నీళ్లు-3 లీటర్లు
8. అరటి పండ్లు- 12
9. నల్లబెల్లం-1 కిలో
10. నీరు – 3 లీటర్లు

**తయారీ విధానం**

- ముందుగా అర కిలో ఆవు నెయ్యిని 5 కిలోల ఆవు పేడలో బాగా కలిపి ఒక కుండలో నాలుగు రోజులు నిల్వ ఉంచాలి.ఈ నాలుగు రోజులు దీనిని ప్రతి రోజు చేతితో బాగా కలపాలి.
- 5వ రోజు ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవుమూత్రం, మాగిన అరటిపండ్లు(మెత్తగా పిసికి), బెల్లం, లేత కొబ్బరి బొండాం నీరు, తాటి లేక ఈత కల్లు మరియు నీరు "3లి" కలపాలి. ఈ మిశ్రమాన్ని 15 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం చేతితో బాగా కలపాలి.మిశ్రమాన్ని పలుచటి గుడ్డతో వడబోయాలి.

**ఉపయోగించే విధానం:** 5 లీటర్లు పంచగవ్యను 100 లి నీటిలోబాగా కలిపి ఒక ఎకరా పొలంలో తగినట్టు పిచికారి చెయాలి. అన్ని రకముల మొక్కల పైవాడుకోవచ్చు. మొక్క పెరుగుదలకే కాకుండా చీడ పీడలను దరి చేర నీయదు.

## వావిలాకు కషాయం

వావిలాకుకషాయాన్ని పంటలలో వచ్చే రసం పీల్చు పురుగు, చిన్న దశలో ఉన్న లద్దె పురుగు, సెనగపచ్చ పురుగు, ఆకులు తినే పురుగుల పై వాడవచ్చు.

**కావలసిన పదార్థాలు :**

1. వావిలాకు : 5 కిలోలు
2. సబ్బు పొడి 100 గ్రాములు లేదా కుంకుడు కాయలు 500 గ్రాములు

**తయారుచేసే విధానం:**





- 5 కిలోల ఆకులను 10 లీటర్ల నీటిలో అరగంట నుండి గంట సేపు బాగా ఉడకబెట్టాలి. ఈ విధంగా ఉడకబెట్టిన ద్రావణం సుమారు 5లీ" ఉంటుంది. ఈ కషాయాన్ని ఒక కర్రతో కలియబెడుతూ ఉండాలి. కషాయాన్ని బాగా చల్లార్చి పలచని గుడ్డతో వడబోయాలి.
- కషాయానికి 100 గ్రా సబ్బు పొడి లేదా 500 గ్రా కుంకుడు కాయలు రసాన్ని కలపాలి.
- 5లీ" కషాయంను 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరా పొలంలో సాయంత్రం వేళ పిచికారీ చేయాలి. తయారు చేసిన ద్రావణాన్ని నిల్వ ఉంచరాదు.

**ఉపయోగాలు:**

- వావిలాకు కషాయం తయారు చేసేటప్పుడు ముక్కుకు గుడ్డ, వంటి పై పూర్తిగా బట్టలు ధరించాలి.
- పంట కాలంలో ఒకటి, రెండు సార్లు మాత్రమే అవసరాన్ని బట్టి పంట పై పిచికారీ చేయాలి.

## అగ్ని అస్త్రం

**కావలసిన పదార్థాలు:**

- ఆవు మూత్రం - 20 లీటర్లు
- దంచిన పొగాకు - 1 కిలో
- దంచిన వెల్లుల్లి - అరకిలో
- దంచిన పచ్చి మిర్చి - 1 కిలో
- దంచిన వేప ఆకులు - 5 కిలోలు

వెల్లుల్లి వేప పచ్చి మిర్చి పొగాకు



**తయారుచేసే విధానం:**

- ఒక మట్టి కుండలో 10 లీటర్లు గోమూత్రం తీసుకుని ఇందులో 1 కిలో పొగాకు ముద్ద, 5 కిలోలు వేపాకు ముద్ద, 1 కిలో పచ్చి మిరపకాయల ముద్ద మరియు అరకిలో వెల్లుల్లి ముద్ద వేసి పాత్ర పైన మూత పెట్టి 4 సార్లుపొంగు వచ్చేటట్లుగా బాగా ఉడికించాలి.
- తర్వాత పాత్రను కిందకు దించి 48 గంటల పాటు చల్లారనివ్వాలి. చివరకు ఒక గుడ్డతో వడగట్టాలి.
- దీనిని 3 నెలల వరకు ఉపయోగించవచ్చు.

**ఉపయోగాలు:** కాండం తొలుచు, కాయ తొలుచు మరియు అన్ని రకాల తొలుచు పురుగుల కొరకు ఎకరానికి 100 లీటర్లు నీటికి లో 2-3 లీటర్ల అగ్ని అస్త్రం కలిపి ఉపయోగించవచ్చు.

## బ్రహ్మాస్త్రం




**తయారీ విధానం:** ఒక పాత్రలో **10 లీటర్లు గోమూత్రం** తీసుకుని అందులో **2 కిలోల వేపాకు ముద్ద, 2 కిలోల సీతాఫలం** ఆకుల ముద్ద, **2 కిలోల కానుగ ఆకుల** ముద్ద, **2 కిలోల ఉమ్మెత్త ఆకుల** ముద్ద, **2 కిలోల జామ ఆకుల** ముద్ద లేదా **ఆముదం ఆకులు, బొప్పాయి ఆకులు, కాకర ఆకులు**, వయ్యారిభామ ఆకులలో ఏవైనా 5 రకాల ఆకులు 2 కిలోల ముద్ద చొప్పున తీసుకుని గోమూత్రంలో కలపాలి. ఆ తరువాత పాత్రపై మూత పెట్టి అరగంట ఉడికించాలి. ఆ తరువాత పాత్రను కిందకు దింపి 48 గంటలు వరకు చల్లారనివ్వాలి. తర్వాత గుడ్డతో వడబోయండి. ఇప్పుడు బ్రహ్మాస్త్రం సిద్ధం.

**ఉపయోగించే విధానం:** ఎకరానికి 100 లీటర్ల నీటికి 2-3 లీటర్ల బ్రహ్మాస్త్రం కలిపి పిచికారి చేయాలి. దీనిని ఆరు నెలల వరకు నిల్వ ఉంచుకోవచ్చు. ఇది లద్దె పురుగులకు బాగా ఉపయోగపడుతుంది.

## తూటికాడ కషాయం



**కావలసిన పదార్థాలు:** 1. తూటికాడ ఆకులు 10 కిలోలు | 2. ఆవుమూత్రం 5 లీటర్లు | 3. ఆవు పేడ 2 కిలోలు

**తయారుచేసే విధానం:**

- 10కిలోల తూటికాడ ఆకులను మెత్తగా రుబ్బి 5 లీటర్ల ఆవుమూత్రం, 2 కిలోల ఆవు పేడ కలిపి ఒక కుండలో పోసి 3 నుండి 5పొంగులు వచ్చేదాక బాగా ఉడకబెట్టాలి. దీనిని రెండు రోజులు పాటు చల్లారనివ్వాలి.
- తరువాత వడబోసి 100 లీటర్లు నీటికి ఈ కషాయాన్ని కలిపి మొక్కల మొదళ్లపై పడేటట్లు ఒక ఎకరా పైరుపై పిచికారి చేయాలి. దీనిని **సుడిదోమ నివారణకు** ఉపయోగించవచ్చు.

## నీమాస్త్రం

**కావలసిన పదార్థాలు:** 1. పచ్చి వేపాకు లేదా ఎండు ఆకులు – 5 కిలోలు | 2.గోమూత్రం -5 లీటర్లు | 3. ఆవుపేడ -1 కిలో

**తయారుచేసే విధానం:** 5 కిలోల **పచ్చి వేపాకు** బాగా నూరిన ముద్ద లేదా 5 కిలోల **ఎండు ఆకులు** లేదా **వేపగింజల** పొడిని 100 లీటర్లు నీటిలో కలపాలి. అందులో 5 లీటర్లు **గోమూత్రం** మరియు 1 కిలో **ఆవుపేడను** కలపాలి. తర్వాత ఒక కర్ర సహాయంతో బాగా కలపండి. 24 గంటల వరకూ మూసి ఉంచాలి. ఆ తర్వాత గుడ్డతో వడకట్టాలి. ఇలా తయారైన నీమాస్త్రం 3 నెలల వరకు నిలువ ఉంటుంది.
ఇలా తయారైన నీమాస్త్రాన్ని పంట విత్తిన 20, 45, 60 రోజులప్పుడు పిచికారీ చేయడం వలన అన్ని రకాల పురుగు గుడ్లను చంపుతుంది. పంటలలో వచ్చే రసం పీల్చే చిన్న చిన్న పురుగుల నియంత్రణకు 2 సార్లు 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. తెగుళ్ళ నివారణకు కూడా పనిచేస్తుంది.

**గమనిక:** తయారైన నీమాస్త్రాన్ని యథావిధిగా ఉపయోగించాలి. నీటిని కలపకూడదు

## పచ్చిమిర్చి - వెల్లుల్లి ద్రావణం

**కావలసిన పదార్థాలు:**

1. పచ్చిమిర్చి - 3 కిలోలు
2. వెల్లుల్లి - అర కిలో
3. కిరోసిన్ - పావు లీటరు (250 మి.లీ.)
4. సబ్బు పొడి - 100 గ్రా
5. వేప ఆకులు - 5కిలోలు

**తయారుచేసే విధానం:**

- 3 కిలోల పచ్చి మిరపకాయలను మెత్తగా నూరి, దానిని 10 లీటర్లు నీటిలో ఒక రాత్రంతా బాగా నానబెట్టాలి. అరకిలో వెల్లుల్లిపాయలను పొట్టుతీసి వాటిని బాగా నూరి 240 మి.లీ. కిరోసిన్లో ఒక రాత్రంతా నానబెట్టాలి.
- మరునాడు పచ్చిమిర్చి ద్రావణాన్ని ఒక పలచని గుడ్డతో వడపోయాలి అదే విధంగా వెల్లుల్లి ద్రావణం 100 గ్రాముల సబ్బుపొడి ద్రావణం,ఈ మూడింటిని బాగా కలిపి మిశ్రమాన్ని తయారు చేయాలి. తయారుచేసిన ద్రావణం సుమారు 10 లీటర్లు వరకు ఉంటుంది.

**ఉపయోగాలు:** ఈ విధంగా తయారుచేసిన ద్రావణాన్ని 100 లీటర్లు నీటిలోకలిపి ఒక ఎకరా పొలంలో సాయంత్రం పూట పిచికారీ చేయాలి.

## ఐదుశాతం వేప కాషాయం

**కావలసిన పదార్థాలు :** 1. వేపగింజలు : 5 కిలోలు 2. సబ్బుపొడి 100 గ్రాములు లేదా కుంకుడు కాయలు 500 గ్రాములు

**తయారుచేసే విధానం:**

- నీడలో బాగా ఎండిన (పై పొట్టు తీసిన) 5 కిలోల మంచి వేపగింజలను మెత్తగా రుబ్బి పిండి చేయాలి.
- ఈ విధంగా తయారైన వేపపిండిని ఒక గుడ్డ మూటలో కట్టి 10లీటర్లు నీటిలో 10-12 గంటలు నానబెట్టాలి.
- తర్వాత నీటిలో మూటను ముంచి పట్టుకుని 15-20 నిమిషాల పాటు ద్రావణాన్ని పిండాలి.
- ఈ ద్రావణాన్ని పలచని గుడ్డతో వడపోయాలి వడపోసిన ద్రావణానికి 100 గ్రాముల సబ్బుపొడిని లేదా కుంకుడు కాయ రసాన్ని కలపాలి.
- ఈ వేప ద్రావణాన్ని 100 లీటర్లు నీటితో కలిపి, ఒక ఎకరం పొలంలో సాయంత్రం సమయంలో పంటపై పిచికారీ చేసుకోవాలి. వేప ద్రావణాన్ని వెంటనే పంటపై పిచికారీ చేసుకోవాలి. నిల్వ ఉంచరాదు.

**ఉపయోగాలు:**

- వేప కషాయాన్ని పొగాకు లద్దెపురుగు, శనగపచ్చ పురుగు, నామాల పురుగు, ఆకుముడత పురుగు మరియు రసం పీల్చే పురుగుల నివారణలో అన్ని పంటలలోనూ మరియు నారుమడిలోను వాడవచ్చు.
- వేప ద్రావణాన్ని అన్ని పంటలలోనూ వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు ఉపయోగించవచ్చు.

**మహిళా అభివృద్ధి సొసైటీ, ప్రధాన కార్యాలయం**
ప్లాట్ నెంబర్: 11&12, తానేషనగర్, మణికొండ
హైదరాబాద్ – 500089
ఫోన్: 081434031/20

**కురబలకోట ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్**
అంగళ్ళు, అంగళ్ళు పోస్ట్, కురబలకోట మండలం
అన్నమయ్య జిల్లా – 517350 | ఫోన్: 9666 259071

**వాల్మీకిపురం ఫార్మర్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్**
పాత సొసైటీ బిల్డింగ్, బైపాస్ రోడ్డు
వాల్మీకిపురం మండలం, అన్నమయ్య జిల్లా – 517299
ఫోన్: 9666 259071